# ఆమె నడిచే దారి అదే...

ఉమాశివ

సంధ్యా దేవి కాషాయపు ఎరుపు చీరపై అమావాస్య నల్లని ముసుగు కప్పేసింది. వేళకాని వేళలో కోడిపుంజొకటి వెర్రిగా కూసింది. నిద్రలో ఉలిక్కిపడ్డ పక్కింటి పసిపాప ఉవ్వే ఉవ్వే అంటూ ఏడవసాగింది. కొంగు నోట్లో దోపుకుని వెక్కిళ్ళు పడుతున్న శర్వాణి దుఃఖం మరింత ఉధృతమైంది.

పసిపాప ఏడ్పువిని ఆలస్యంగా నిద్రలేచిన తల్లి "లేదు లేమ్మా బుజ్జీ...ఏడవకు ఏడవకు వెర్రినా తల్లీ...జో...జో..." అంటూ ఓదార్చసాగింది.

'ఆ పసిపాప ఎంత అదృష్టవంతురాలు. శర్వాణి వెక్కిళ్ళనాపుకుంటూ గొణుక్కుంది. అర్ధరాత్రైనా సరే హాయిగా, స్వేచ్ఛగా, బిగ్గరగా ఏడవగలుగుతుంది. కాని నేనో...గుండె అగ్ని గుండంలా మండుతున్నా నేనలా ఏడ్వలేను...ఏడ్వకుండా ఉండలేను. హృదయం లోంచి ఎగదన్నుకొస్తున్న దుఃఖం శర్వాణి ఎంత ఆపుకుందామన్నా ఆగక వెక్కిళ్ళ రూపంలో సవ్వడి చేస్తుంది.

జరిగినదంతా ఒక్కసారి మనోనేత్రం ముందు మెదిలింది. గుండె కన్నీటి గట్టు తెగింది. దూరాన ఎక్కడో ఒక కుక్క దీనాతిదీనంగా ఏడ్వసాగింది. రెండు నిమిషాలకు మరికొన్ని కుక్కలు గొంతు కలిపాయి. ఒక్క క్షణం శ్వాస బిగబట్టి ఆ ఏడ్పులు విన్న శర్వాణి వెన్ను జలదరించింది. ఎన్నడూ ఎరుగని భయమేదో ఆమెను చుట్టుముట్టింది.

ఎందుకిలా జరిగింది. ఏం చెయ్యాలిప్పుడు.... ఆమెలో ఇవే ప్రశ్నలతో ఇవే ఆలోచనలతో దుఃఖం తెరలు తెరలుగా పెల్లుబుకుతోంది. వెక్కిళ్ళు ఆగడంలేదు. ఇంతలో శర్వాణి భుజంపై చెయ్యి పడింది. ఉలిక్కిపడి తలెత్తింది శర్వాణి. "శర్వాణి ఏమిటమ్మా ఇలా...సాయంత్రం నుండి గమనిస్తున్నాను. ఎందుకిలా ఏడుస్తున్నావు.... ఏం జరిగిందమ్మా..." మాతృత్వపు మార్దవమంతా తల్లి కంఠంలో తొణికిసలాడింది. ఇక నిలువరించుకో లేకపోయింది. "అమ్మా...." అంటూ తల్లిని చుట్టేసింది. వెక్కిళ్ళ మధ్య 'అమ్మా...అమ్మా' అనే పదాలు పసిపాప కొత్తగా నేర్చుకున్న పదాల్లా తడబడుతూ వస్తున్నాయి

"ఏం జరిగింది తల్లీ".. తలనిమురుతూ... తల్లి అడిగింది. తల్లి గుండెల్లో గువ్వలా ఒదిగిపోతున్న శర్వాణి ఆ ప్రశ్నతో నెత్తిన పిడుగు పడ్డట్టు ఉలిక్కిపడింది. తత్తర పడి పెదవులు వణికాయి.

అవును ఏంజరిగింది... తనకేం జరిగింది... ఏంజరిగిందంటే.. అమ్మకు చెప్పుకుందామని పెదవులు తడబడ్డాయి. 'అమ్మా' అంటూ.. మొదలు పెట్టి అంతటితోనే ఆగిపోతున్నాయి. ఎన్ని సార్లు చెప్పబోయినా ఆ ఒక్క మాట తప్ప మరేమి మాట్లాడలేకపోతున్నది. ఆ ఒక్క మాటతోనే దుఃఖం ఎగదన్నుకొస్తున్నది.

ఈ లోగా శర్వాణి తండ్రి రాఘవరావు గారు వచ్చారు. "ఒరే శర్వాణీ.. ఏం జరిగిందో చెప్పకుండా అలా ఏడిస్తే మాకేం అర్ధమవుతుందిరా" తల నిమురుతూ అడిగాడు.

నిజమే తానేమి చెప్పకుండా అమ్మా నాన్నలకెలా తెలుస్తుంది. చెప్పేయ్యాలి. తనింక ఈ బాధ భరించ లేదు చెప్పెయ్యాలి.. అనుకుంది శర్వాణి.

"నాన్నా. ఇవాళ సాయింత్రం..." అంటూ మొదలు పెట్టబోయి అకస్మాత్తుగా ఆగిపోయింది. వెర్రిగా ఇద్దరివంకా చూసింది. ఏంజరిగిందో చెప్పేస్తే.. తనను గుండెల్లో పొదవుకున్న అమ్మమరింత దగ్గరకు తీసుకుని లాలిస్తుందా... తన తండ్రీ.. కన్నీరు తుడిచి చేయందించి భవిష్యత్తులోకి నడిపిస్తాడా?

తన వివేచన వేసిన ప్రశ్నకు ఉలిక్కిపడింది శర్వాణి. ఊహూ చెప్పకూడదు. చెప్పకూడదు. చెబితే ఈ ఇంట్లోనూ.. వాళ్ళ మనసుల్లోనూ తన స్థానం అనూహ్యం.

"ఏం లేదమ్మా.. ఏంలేదు నాకేం కాలేదు. మీ రెళ్ళి పడుకోండి." అంది శర్వాణి. వాళ్ళక్కడి నుండి కదల్లేదు. కూతురి పరిస్థితి వారికి అయోమయంగా ఆందోళనగా ఉంది. ఇంక ఇలా కాదని శర్వాణి లేచి వెళ్ళి ముఖం కడుక్కొచ్చి మెడవరకు దుప్పటి కప్పుకుని కళ్ళు మూసుకొని నిద్ర నటించింది. రెండు నిమిషాలాగి నిద్ర పోయిందని నిర్ధారించుకుని కాబోలు వాళ్ళు అవతలి గదిలోకి వెళ్ళారు. వాళ్ళ మాటలు శర్వాణికి స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"ఏమైందో ఏమోనండి... అడిగితే చెప్పదూ సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో ఇల్లు చేరింది. వచ్చేటప్పటికే బాగా ఏడ్చినట్లుగా కళ్ళు వాచిపోయి ఎర్రగా ఉన్నాయి. జుట్టంతో చెదిరిపోయి ఉంది. తిండి కూడా తినకుండా, తననెవరూ పలుకరించ వద్దని చెప్పి తన గదిలోకి వెళ్ళి పడుకుంది. కాస్సేపయ్యాక వెళ్ళి చూద్దును గదా వెక్కి వెక్కి ఏడుస్తున్నది. పలుకరించబోతే... 'నన్నిలా వది లెయ్యండి కాస్సేపు' అనివిసుక్కుంది. ఏ స్నేహితురాలితోనో గొడవ పడి వచ్చింది కామోనని ఊరుకున్నాను. ఇంత అర్ధరాత్రి ఈ ఏడ్పేమిటండి..." విలవిల్లాడుతూ చెప్తోంది వసుంధర.

"కాలేజీలో ఏదో గొడవ జరిగి ఉంటుంది. ఇదసలే. ఏ చిన్న దెబ్బైనా తట్టుకోలేదు. అయినా రేపొద్దుట నేను కనుక్కుంటాను గానీ... నువ్వు పడుకో," రాఘవరావు వసుంధరను సమాధాన పరిచాడు.

అవును ఇప్పటికైతే తను తప్పించుకుంది. కాని తెల్లవారితే నాన్న అడిగితే ఏంచెప్తుంది. ఒక రమీజాబిలా... ఒక షకీలాలా... నేను కూడా కొందరు మగ వాళ్ళ పైశాచికత్వానికి బలైపోయాను నాన్నా. అని ఎలా చెప్తుంది.

ఒకరు కాదు ఇద్దరు కాదు నలుగురు మనుష్య రూపంలో ఉన్న రాక్షసులు నన్ను నిలువునా దగా చేసి దోచుకున్నారు నాన్నా అని ఎలా చెప్పుకోగలుగుతుంది? ఈ సంగతివింటే అమ్మ గుండె పక్కలై పోదూ... అయ్యో ఇరవై రెండేళ్ళు నిండని నా కూతురి మానందోచేశారా... అని గుండె నీరైపోయేటట్లు ఏడ్వదూ....

నాన్న "అయ్యో నా తల్లీ... ఎంత అన్యాయం జరిగిందిరా నీకూ" అంటూ కుమిలి పోరూ... "నీ బ్రతుకిలా చితికిపోయిందేమిటి తల్లీ!" అని కలత చెందరూ..

నిద్ర పట్టడంలేదు. ఎచ్చి పుండులా ఉన్న శరీరం... అగ్నిగుండంలా ఉన్న గుండె శర్వాణికి జరిగిన ఘోరాన్ని అనుక్షణం గుర్తు చేస్తున్నాయి. ఆమె ఆలోచిస్తోంది. "వద్దు వద్దూ" అని అరుస్తూ... వారిస్తూ ఎంతో గింజుకుంది తను. దీనంగా ఏడుస్తూ ఎంతగా ప్రాధేయ పడింది... ఆ ఘోరం జరుగుతున్నపుడు ఎంత విలవిల లాడింది. తన పట్ల జరుగుతున్న అక్రమానికి అత్యాచారానికి ఎంతగా ఆక్రోశించింది. ఆ అమానుషాన్ని తన ఆక్రందన ఏమీ ఆపలేకపోయింది. ప్రకృతి సిద్ధంగానే స్త్రీ పురుషునికి కన్నా శారీరకంగా బలహీనురాలు. అందునా ఒక్కత్తి... నలుగురు చేరి ఏ మాత్రం ఎదిరించలేని అసహాయను చేసి క్రూరమైన ఆనందాన్ని పొందారే తనే కాదు. ఆస్థితిలో ఏ ఆడపిల్ల ఉన్నా అంత కన్నా ఏంచెయ్యగలదు.

శర్వాణి కళ్ళలోంచి జారే కన్నీటిధార ఆగడం లేదు. ఆమె మనసులో చెలరేగే తుఫాను ఆగడంలేదు. "అయిపోయింది... ఏమీ చెయ్యలేని నిస్సహాయతతో నా బ్రతుకు మలిన మయిపోయింది." కుమిలి కుమిలి ఏడుస్తోంది శర్వాణి.

అసలు అనుభవించాలనుకునే ఆడదాని అందాన్ని చూస్తాడేకాని మగవాడు... తాను బలవంతంగా మలిన పరిచిన ఆ అభాగ్య అతివ బ్రతుకులోకి ఒక్కసారి.. ఒక్కసారి తొంగి చూస్తే. ఒక్కసారి హృదయమున్న మనిషిలా ఆలోచిస్తే... అలాంటి పని జన్మలో చెయ్యగలుగుతాడా...

స్త్రీని విలాస వస్తువుగా మార్చిన సభ్య సంస్కృతి ఎంతటి అకృత్యం చేయిస్తుంది. తన గురించి ఆలోచించి బాధ పడుతున్నది. ఏం చెయ్యాలిపుడు తెల్లవారితే... ఏం జరిగిందమ్మా అని అమ్మా నాన్న అడిగితే... అక్క ఎందుకలా ఉందని తమ్ముడూ చెల్లెళ్ళు ప్రశ్నిస్తే, తన ముఖంలోని దైన్యం చూసి స్నేహితురాళ్ళు ఏమిటే అంటే.... వాళ్ళందరికి ఏం సమాధానం చెప్పాలి... ఎవరికో సమాధానం చెప్పడం అటుంచి... ముందు నా మనసును నేనేమని సమాధాన పర్చుకోవాలి. మళ్ళీ మామూలుగా ఎలా బ్రతకాలి. ఛీ.. ఈ శరీరం అంటేనే అసహ్యం వేస్తుందే.. ఎలా బ్రతకాలి? అసలెందుకు బ్రతకాలి?


ఊహూ... నేను బ్రతకకూడదు. చచ్చిపోతాను. అవును. ఈ పరిస్థితిలో మరణమే శరణ్యం. చచ్చిపోవాలి." శర్వాణి మంచం మీదనుంచి గభాల్న లేచింది. చచ్చిపోవాలన్న ఆలోచన ఆమెనింక క్షణంకూడా నిలవనీయలేదు.

చప్పుడుకాకుండా తలుపు తీసింది. శర్వాణి. పెరట్లోని బావి వద్దకు నడిచింది.

యుగాలు అంతరించినా కాలం ఎంత కదిలిపోతున్నా.. తరాలెన్ని మారిపోతున్నా ఆడదింతే... తమ చెయ్యని తప్పును తనపై వేసుకుని తనను తాను శిక్షించుకుంటుంది. ఈ గడ్డమీద పుట్టిన ప్రతీస్త్రీ నరనరాల్లో ఆన్యభావం బాగా జీర్ణించుకుపోయింది.

తాను బలైపోవడానికి సిద్ధమౌతుందిగాని ఎదురుతిరగాలని మాత్రం చూడదు. అందుకే ఇన్ని ఆత్మహత్యలు... ఇన్ని ఘోరాలు.

శర్వాణిది చాలా అభ్యుదయ భావాలనీ, చాలా ధైర్యవంతురాలని స్నేహితురాళ్ళు అనుకుంటుంటారు. అటువంటి శర్వాణి కూడా ఆక్షణంలో నిస్సహాయంగా... అలాంటి మార్గాన్నే ఎన్నుకుంది.




బావిలోకి తొంగిచూసింది. "ఇందులో దూకెయ్యాలి... అవును.. నా బ్రతుక్కింక ఇదే పరిష్కారం.... అవే చివరి క్షణాలన్నట్లుగా ఆమె దోసిట్లో ముఖం చేర్చుకుని వెక్కివెక్కి ఏడవసాగింది. తన సమస్య తీరబోతుందన్న తృప్తిలోంచే తన బాధనుండి విముక్తి కాబోతుందన్న భావంలోంచీ... ఆమె మనసు కాస్త తేలిక పడింది. 'ఇపుడు నేను చావబోతున్నాను. ఈ లోకంలోని మనుష్యుల దానవత్వానికి పైశాచికత్వానికి అమానుషత్వానికీ అతీతమైన లోకాలకు వెళ్ళిపోతున్నాను. ఇంకా వెర్రివెర్రి ఏడ్పులెందుకు... దూకెయ్యాలి ఈ బావిలో...'

శర్వాణి అలా అనుకొంటున్నంతలో వరండాలో లైటు వెలిగింది. ఉలిక్కిపడిన శర్వాణి తడబాటుతో ఎటో తెలియకుండా నాలుగడుగులు వేసింది.

"శరూ! ఇక్కడేం చేస్తున్నావురా..." తండ్రి రాఘవరావు అడిగాడు.

"ఏం లేదు నాన్నా బాత్రూంకెళ్దామనీ...' చటుకున్న అబద్ధమాడేసి... బాత్రూంలోకి వెళ్ళి తలుపేసుకుంది.

ఆ తర్వాత తన రూంలోకి వచ్చి పడుకుంది. "ప్చ్.... ఆ ఒక్క క్షణం నాన్నరావడం ఆలస్యమైతే నేను హాయిగా ఈ పాడులోకం వదిలి వెళ్లేదాన్ని కదా... హాయిగా స్వేచ్ఛగా చచ్చిపోయే అదృష్టం కూడా లేదు నాకు...' నీరసంగా అనుకుంది శర్వాణి.

కొద్ది నిమిషాలు మౌనంగా గడిచిపోయాయి. గూర్ఖా ప్రతి గుమ్మం ముందర మూడుసార్లు కర్రతో కొడుతున్నాడు. శర్వాణి ఆలోచనల్లో, అంతరంగ సంఘర్షణలోనే గంటలు దొర్లి పోయాయి ఎవరింట్లోనో అలారం మ్రోగింది. తన విషాదానికి వివేచనకూ జరుగుతున్న సంఘర్షణలో శర్వాణి ఆ శబ్దాన్ని వినిపించుకోలేదు.

"తనెందుకు చావాలి?" అకస్మాత్తుగా ఆమెలో ప్రశ్న తలెత్తింది.

"నలుగురు దుర్మార్గుల దురాగతానికి బలై నేనేమో కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నాను. కానీ... ఆ నల్గురూ... ఏం చేస్తూండి ఉంటారో ఈసరికి? తమ కోరిక తీరిందన్న ఆనందంలో మత్తుగా త్రాగి విశ్రాంతిగా నిద్రిస్తుంటారు. రేపట్నుండీ రోజూలాగే మగవాళ్లమనే గర్వంతో హుందాగా వీధుల్లో తిరుగుతారు. కాని నేను... గుండెలు పగిలేలా ఏడుస్తూ చావుకు మార్గాలు అన్వేషిస్తున్నాను.

"నేరం చేసిన వారు నిశ్చితంగా తిరుగుతుంటే... చేయని తప్పుకు బలై రేపట్నుంచి తను గతం గుర్తొస్తూంటే ప్రతిక్షణం బేలగా దీనంగా తిరగాలి... ఛీ.. ఛీ ఒక్క సంఘటనతో తన జీవిత గతినే మార్చేశారు దుర్మార్గులు..." ఆమెలో కసిచెలరేగింది. తనను వికృతంగా అనుభవించిన ఆ రాక్షసుల్ని షూట్ చెయ్యాలి. కాల్చి చంపాలి. అనుకుంది. వాళ్ళకు నేనేం అన్యాయం చేశానని ఈ దురాగతానికి పాల్పడ్డారు... తన మనసునెందుకు చిత్రహింసకు గురిచేసారు...? అమాయకంగా అనుకుంటూ శర్వాణి దుఃఖిస్తూండగానే పాలవాడి కేక వినిపించింది. అప్పుడే తెల్లారిపోయిందా! కిటికీలోనుండి బయటకు చూసింది.

"చీకటి నంతా.... నాగుండెల్లోకి తోసేసి ఉదయమా నీవొచ్చేసావా...." వెర్రి నవ్వునవ్వుకొంటూ అనుకుంది.

"శరూ... లేమ్మా ఆరైంది..." తల్లివచ్చింది. వసుంధర కూతురి ముఖం చూసి కంగారు పడింది. ఎర్రబారి వాచిపోయిన కనుబొమలు, పదిలంఖణాలు చేసినట్లున్న ముఖం. చెదిరిపోయిన జుట్టూ... ఏదో అందామనీ... అడుగుదామని పెదవులదాకా వచ్చినా భర్త మాటలు గుర్తుకు వచ్చి ఏమీ అడగకుండానే కాఫీ కలపడానికి వెళ్ళిపోయింది. ముఖం కడుక్కుందామని లేవబోయిన శర్వాణికి కళ్ళు తిరిగినట్లయింది. నిలదొక్కుకుని కూర్చుంది. నిస్సత్తువగా ఉంది. వళ్ళంతా పచ్చిపుండులా ఉంది. కళ్ళు భగ్గున మండుతున్నాయి. నరాలు చిట్లిపోయేలా తలనొప్పి గుండెంతా మంటగా భారంగా అన్పించింది.

మెల్లగా లేచి బాత్రూంవైపు నడిచింది. అడుగులు తడబడుతున్నాయి. కాళ్ళు చేతులు నీరసంతో వణికిపోతున్నాయి. శరీరం రేపే గాయం కన్నా అది గుర్తుచేసే దారుణానుభవపు మానసిక గాయం రగిలిస్తున్న మంట ఎక్కువైంది. ఎంత నిగ్రహించుకుందామన్నా ఆగని బాధను అణిచిపెట్టడానికి, శతవిధాలా ప్రయత్నిస్తూనే దోసిట్లో ముఖం జేర్చుకుని కళ్ళని గట్టిగా మూసుకుంది. నిశ్శబ్దమైన రోదన. తనను తాను నిగ్రహించుకుని రెండు నిమిషాల్లో ముఖం కడిగాననిపించింది. బయట తల్లి వెలిగించిన బాయిలర్ కనిపించింది. అంతే వెంటనే వెళ్లి బట్టలు తెచ్చుకుని మరుగుతున్న వేడినీళ్ళు రెండు బకెట్లు తీసుకుని చన్నీళ్ళు కలుపుకుని నాలుగు బకెట్ల నీళ్ళు చేసింది. తలమీదుగా జారి వేడివేడి నీరు వళ్ళంతా ప్రవహిస్తూంటే కాపు పెట్టినట్లై హాయిగా ఉంది శర్వాణికి.

తల్లి ఇచ్చిన వేడివేడి కాఫీ తాగి గదిలోకి వెళ్ళి కూర్చుంది. నిన్న మధ్యాహ్నం నుండీ కడుపులో ఏమీ లేకపోవడంచేత తండ్రి టిఫిన్ చేద్దాం రమ్మని పిలవగానే మౌనంగా వెళ్ళి టిఫిన్ చేసి వచ్చింది. వంట్లో జ్వరం వచ్చినట్లుంది. శర్వాణి కాస్త విశ్రాంతి తీసుకోవడమే మంచిదనుకున్నారు వసుంధర రాఘవరావులు. అందుకే శర్వాణి "ఇవాళ కాలేజీకి వెళ్లనమ్మా... "అనగానే "అలాగే రెస్ట్ తీసుకో. చూడు ఎంత నీరసంగా కన్పిస్తున్నావే..." అన్నారు.

గదిలో మంచంమీద పడుకుని ఆలోచిస్తోంది శర్వాణి. కాలేజీకి వెళ్ళాలంటే ఎన్నడూ లేనిది మనసు భీరువైపోతోంది. ఏం చెయ్యడమిప్పుడు... తనింక ఈ బాధ భరించలేదు. అమ్మానాన్నలకు చెప్పేస్తే.. చెబితే నాన్న పోలీస్ రిపోర్టిద్దాం అంటారేమో! అవునూ నాన్నదాకా ఎందుకు తనేవెళ్ళి పోలీసురిపోర్టిస్తే... అవును ఎందుకు ఊర్కోవాలి... ఈ ఆలోచన రాత్రే ఎందుకు రాలేదు. వెళ్ళి... నేను పి.జి.సెంటర్‌లో ఎమ్.ఏ. ప్రథమ సంవత్సరం విద్యార్థినిని సెమినార్‌కి అటెండయి వస్తూ లైబ్రరీలో బుక్స్ తిరిగి ఇచ్చేసి వస్తూంటే సాయంత్రం ఆరుగంటల సమయంలో... దారిలో.. అప్పుడు... అని మొత్తం చెప్పి రిపోర్ట్‌రాసిస్తే!

క్షణం ఆలోచించింది. ఏమిటీ పోలీసులకు రిపోర్టా.. అయినా మానభంగం గురించి పోలీసు రిపోర్టా... అనుకుని పక్కున నవ్వుకుంది. మరుక్షణం ఆనవ్వే ఏడుపుగా మారింది. ఈ పోలీసు లేకదా రమీజాబిని బలితీసుకుంది... ఆ జాజి రంగు గోడల వెనుక ఎన్ని అమాయక హృదయాలు నలిగిపోయాయో కదా...

ఒకచోట ఎప్పుడో ఏదో జరిగితే అందరిని అలా అనుకుంటే ఎలా... కాదు ఈ లోకంలో న్యాయం ఇంకా బ్రతికే ఉంది... తనకు న్యాయం జరుగుతుంది అని నమ్మివెడితే... రిపోర్ట్ రాసుకుంటారు. డాక్టర్‌తో చెకప్ చేయిస్తారు. నిజమే నిన్న ఈమె నలుగురి దారుణానికి బలైపోయిందని రిపోర్ట్ వస్తుంది. ఆ తరువాత కేస్ విచారణకు వస్తుంది ఎవరా నల్గురు అంటారు. అవును ఎవరూ వాళ్ళంటే తనేం చెప్పగల్గుతుంది. వాళ్ళు తనకేం తెల్సనీ... అసలు వాళ్ళకి మాత్రం తనేం తెల్సనీ... వాళ్ళకు ఒక్కటే తెల్సు పాశవికపుకోర్కె.... మరొకటి తెల్సు తను ఆడదని అంతే వాళ్ళ రాక్షసాగ్నికి తనో సమిధఅయ్యింది.... ఆలోచిస్తోంది శర్వాణి.

ఆ తర్వాత కేసు దర్యాప్తులో ఉంది అంటారు. ఒక విద్యార్థినిపై అత్యాచారం జరిగిందన్న వార్త ప్రెస్‌కు చేరుతుంది. అన్ని దినప్రతికల్లోనూ "మానవత్వం మంటకలసిన వేళ" "అబలపై అత్యాచారం...." విద్యార్థిని మానభంగం" అంటూ హెడ్డింగ్స్ పెట్టి తనగురించి రాస్తారు. కొన్ని ఊహాగానాలు చేస్తారు. ఆ వార్త అంతటా తెలుస్తుంది. ప్రముఖ శాసన సభ్యుడొకడు దినపత్రిక తీసుకెళ్ళి శాసనసభ ముందుంచుతారు. సభలోని మహిళలందరూ... రోజు రోజుకీ మహిళల పరిస్థితి దిగజారిపోతుందని ఆవేశ పడ్తారు. ప్రస్తుత ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమైందని ఇందుకు మీ సంజాయిషీ ఏమిటని నిలదీస్తారు. కేస్ దర్యాప్తు జరుగుతుంది. ఆ విద్యార్థినికి న్యాయం జరిగేలా చూస్తామని దోషులను శిక్షిస్తామని పాలకపక్షం హామీయిస్తుంది. అయినా రాష్ట్రంలో మహిళలకు భద్రతలేదంటూ నిరసనగా ప్రతిపక్షాలు వాకౌట్ చేస్తాయి.

ఇంకా ఏంజరుగుతుంది పేపర్‌లో వార్త వచ్చినరోజున విద్యార్థి సంఘాలు మహిళాసంఘాలు సమావేశమౌతాయి. మర్నాడు తోటివిద్యార్థిని పైజరిగిన అత్యాచారాన్ని నిరసిస్తూ బాయికాట్ చేస్తారు. "ఎం.ఎ. ప్రథమ సంవత్సరపు విద్యార్థిని శర్వాణిపై జరిగిన అత్యాచారాన్ని ఖండించండి" అంటూ రకరకాల నినాదాలు గోడలపై రాస్తారు. ఒకరోజు ఊరంతా స్లోగన్లురాసిన అట్టలు పట్టుకు తిరిగి కలెక్టరుకి మెమోరాండం ఇచ్చి ఆయనతో ఆ అమ్మాయికి న్యాయం జరిగేలా చూస్తామని వాగ్దానం తీసుకుని వస్తారు. ఆ తరువాత... ఆతరువాత ఆ అట్టలు డస్ట్‌బిన్‌లలో పడ్తాయి. ఆ రాతలు గోడలమీదే ఉండిపోతాయి. తను నల్గురికీ ముఖం చూపించలేక నాలుగు గోడల మధ్య ఉండిపోతుంది. అంతకంటె ఏమౌతుంది. లాభం లేదు అమ్మకు చెప్పేస్తే...

ముందు తనను పట్టుకు ఏడుస్తుంది. తర్వాత వాళ్ళనూ.. దేవుడ్ని తిడుతుంది. ఆ తరువాత... ఆడపిల్లవు నీజాగ్రత్తలో నీవు ఉండద్దూ... మా పరువు తీసావుకదే అంటుంది. తప్పు తనేం చెయ్యలేదని తెల్సినా. చదువు ఆగిపోతుంది. కొన్ని రోజులు ఇంట్లో అంతా సానుభూతిగానే చూస్తారు. నాన్నగారి ఆఫీసులో "శర్వాణి అంటే మీ అమ్మాయేనటగా... పాపం ఘోరం జరిగిపోయిందండి పెళ్లికావలసిన వయసులో ఆ పిల్లబ్రతుకు అన్యాయమైపోయింది కదండీ" అంటూ సానుభూతి చూపుతూ ఏమైనా పెళ్ళి సంబంధాలు వస్తున్నాయా... అని అడుగుతూనే ప్రక్కకు వెళ్ళి వ్యాఖ్యానాలు చేస్తారు.

"ఏవమ్మా వసుంధరా పాపం మీ పెద్దమ్మాయిని మొన్న రౌడీలు ఏదో చేసారటగా. పాపం పెద్ద కష్టమే వచ్చిపడింది. ఏవన్నా సంబంధాలు చూస్తున్నారా..." వ్యంగ్యాన్ని దాచుకుంటూ సానుభూతినటిస్తూ అడుగుతారు. అమ్మానాన్నలు అలాంటిమాటలు అన్సలు తట్టుకోలేరు. అమ్మానాన్నలకేకాదు మధ్యతరగతి మానవుడి పంచప్రాణాలు పరువు మర్యాదలే కదా. అవేపోతే వాళ్ళు ఏవైనామింగి చావడానికి కూడా


**Statement about ownership of VANITHA (Telugu)**

**Rule 8 (Form VI), Newspapers (Central) Rules, 1956**

| | | | |
|---|---|---|---|
| *1. Place of Publication* | 'CHANDAMAMA BUILDINGS'<br>188, N.S.K. Salai<br>Vadapalani, Madras-600 026 | 5. Editor's Name | B.VISWANATHA REDDI |
| | | Nationality | INDIAN |
| | | Address | 'Chandamama Buildings'<br>188, N.S.K. Salai<br>Vadapalani, Madras-600 026 |
| *2. Periodicity of Publication* | MONTHLY<br>Ist of each calender month | | |
| *3. Printer's Name* | B.V. REDDI | 6. Name and Address of individuals who own the paper | DOLTON PUBLICATIONS<br>PARTNERS:<br>1. Sri B.VISWANATHA REDDI<br>2. Sri B. VENKATRAMA REDDY<br>3. Sri B.N. SURESH REDDY (Kartha of B.L.N. Prasad)<br>4. Smt. B. VASUNDHARA |
| *Nationality* | INDIAN | | |
| *Address* | Prasad Process Private Limited<br>188, N.S.K. Salai<br>Vadapalani, Madras-600 026 | | 'Chandamama Buildings'<br>188, N.S.K. Salai<br>Vadapalani, Madras-600 026 |
| *4. Publisher's Name* | B.VISWANATHA REDDI | | |
| *Nationality* | INDIAN | | |
| *Address* | DOLTON PUBLICATIONS<br>188, N.S.K. Salai<br>Vadapalani, Madras-600 026 | | |

I, B Viswanatha Reddi, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

*1st March 1991*

**B. VISWANATHA REDDI**
*Signature of the Publisher*

వెనుకాడరు. ఈ దారుణం లోకానికి తెలిస్తే తననెవరూ చేసుకోవడానికి ముందుకు రారు సరికదా... చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు ఎలా అవుతాయి. ఇంత ఘోరం జరిగాక తను చచ్చిపోతే ఆ బాధ అక్కడితో ముగిసిపోతుందేమో. బ్రతికి ఉంటే... చావనన్నా చచ్చిందికాదు మా బ్రతుకులు నవ్వులపాలు చేసిందని ఇంట్లోవాళ్ళు అనరని, అను కోరని నమ్మకంలేదు. ఈ నిజం ఆమె పెదవిదాటిన మరుక్షణం జీవితాంతం ప్రతిక్షణం నరకాన్ని చవి చూడాల్సి వస్తుంది.

నేరాలు దారుణాలు చేసేవారు ఎవరోకాదు మన మధ్య తిరుగుతున్న సాటి మనుష్యులే అయినపుడు... మనిషే మనిషి చేతిలో దగాచేయబడుతున్నపుడు... హింసించబడుతున్నపుడు ఎలా వారిని గుర్తించడం ఎలా జాగ్రత్తపడడం..? అసలయినా జాగ్రత్తగా ఉండట మంటే ఏమిటి? భార్య తన భర్తతో స్కూటర్‌పై సినిమాకు కూడా వెళ్ళకుండా జాగ్రత్తగా ఉండాలా...

మరి ఇళ్ళలోకి జొరబడి భర్తముందు భార్యను, తల్లి తండ్రులముందు కూతుర్ని మానభంగం చేసిన ఉదాహరణలున్నాయే ఇంకా ఎలా జాగ్రత్తగా ఉండాలి. స్త్రీల వస్త్రధారణ విపరీతపు అలంకరణ మగవాడిని రెచ్చగొడ్తున్నదని ఒకవాదన. ఏముంది వస్త్రధారణలో ఐదుమీటర్ల కాటన్‌చీర జాకెట్టు, నగంవరకు అల్లి వదలిన జడ. ఒకచేతికి నాలుగు మట్టిగాజులు మరో చేతికి చిన్నవాచ్ కళ్ళకు కాటుక నుదుట కుంకుడు గింజంత బొట్టు మెడలో సన్నని చైన్. కాళ్ళకు హవాయిచెప్పులు ఏ మధ్యతరగతి ఆడపిల్లైనా ఇంత కన్నా ఎక్కువగా ఏం అలకరించుకుంటుంది.

అయినా తన పిచ్చిగాని తన వయసంత ఆడపిల్ల లైతే కానీ అలంకరణతోను వస్త్రధారణతోనూ రెచ్చ గొడ్తున్నాం అనుకోవచ్చు. మరి పదేళ్ళ శ్వేతలో రెచ్చ గొట్టిన అంశమేముంది.

ఈ దురాగతాలకు కారణం ఎక్కడో లేదు. నిగ్రహం లోపించడం క్షణికసుఖం కోసం పైశాచికంగా మారి పోవడం. ఒకానొక క్రూరమైన బలహీనతకు లొంగి పోవడం. ఇవన్నీ ఉన్నవి కొందరు మగవాళ్ళలోనే కోరిక వెర్రితలలేసి వివేకం చచ్చిపోయి అడదైతేచాలు పీనుగైనా ఫర్వాలేదన్న స్థితికి దిగజారిపోతున్నారు.

అందుకే శర్వాణి లాంటి ఎందరో అతివలు దారుణంగా బలై కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తట్టుకోలేనివారు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇలా ఆలోచిస్తోంది శర్వాణి.ఒక క్షణం బేలగా ఏడుస్తుంది మరుక్షణం ఆవేశపడిపోతుంది. మరోసారి స్థిమితంగా ఆలోచిస్తున్నది. కర్తవ్యాన్ని నిర్ణయించుకోవడానికి మంచీచెడూ బేరీజు వేస్తుంది. క్షణం కూడా ఆమె మనసు మూగబోలేదు. సంఘర్షణలో నలిగిపోతూనే ఉంది.

• • •

ఆరోజు పెరట్లో చెట్ల మధ్య తిరుగుతున్నది. సాయంత్రం నాలుగవవస్తుంది. నీరెండగా ఉంది. ఆమెలో ఆలోచనలు మళ్ళీ ఆత్మహత్య వైపుకు మళ్ళి నాయి. మానభంగాలకు గురైన స్త్రీల గురించి సర్వే చేస్తే ప్రతీ రెండుగంటలకు ఒక స్త్రీ మానభంగానికి గురౌతున్నది అని తేలిందట. దురాగతానికి గురైన ప్రతీ ఆడది బయటకు చెప్పుకోలేక చెప్పుకుని బ్రతుకు వెళ్ళదీయలేక ఇలా ఆత్మహత్య చేసుకుంటూ పోతే ఎందరి బ్రతుకులు నిర్దయగా బలైపోతాయి... ఎందరు తల్లిదండ్రులు కడుపుకోతకు గురౌతారు. ఎందరి పిల్లలు నిరాశ్రయలౌతారు. ఆలోచిస్తున్న ఆమె దృష్టి అరటిచెట్టుపై పడింది.

పువ్వుపూసిన అరటిచెట్టు కొత్త అందం సంతరించుకుని శోభయమానంగా ఉంది. దానిక్రింది భాగం ఆకులు చీలిపోయి ఉన్నాయి. అది చూస్తుంటే శర్వాణికి అరిటాకు ముల్లు సామెత గుర్తుకు వచ్చింది.

"అరిటాకు వెళ్ళి ముల్లుమీద పడ్డా ముల్లువచ్చి అరిటాకుమీద పడినా అరిటాకుకే నష్టం అని ఎందరో అరిటాకుతో అడబ్రతుకును పోల్చి చెప్పడం గుర్తుకు వచ్చింది. 'చ్ఛ'... ముఖంలోకి రక్తం పొంగుకురాగా ఆవేశంగా అనుకుంది. గాలివాటుకే చీలిపోయే అరిటాకుతో ఎందుకు ఆడదాని జీవితాన్ని పోల్చుకోవాలి.. ఒక ఆకు చిరిగినా మరో ఆకు పండినా ఎప్పటి కప్పుడు కొత్త ఆకుల్ని తొడుగుతూ పూతపూసి ఫలాల నందిస్తుందే ఆ అరటిచెట్టుతో పోల్చకుండా ఆకుతో పోల్చి కించపరచడం ఎందుకు. శర్వాణి ఆలోచిస్తున్నది. ప్రక్కింటి టేప్‌రికార్డర్‌లో నుండి పాటలు వస్తున్నాయి. హఠాత్తుగా ఆమె చెవులో పడింది ఘంటసాల గొంతు.

"గాలి వీచి పూవులతీగా నేలరాలిపోగా
జాలివీడి అటులే దాని వదలివైతువా
చేరదీసి నీరుపోసి చిగురింపనీయవా.. శ్రీశ్రీ భావాన్ని తన గొంతుతో మధురంగా పలికిస్తున్నాడు ఘంటసాల.. అది వింటున్న ఆమె ఆలోచనలు మరింత చైతన్యవంతమైనాయి. నన్ను మలినంచేసిన ఆ మగమహారాజు లంత ధీమాగా తిరుగుతున్నారే... నేనూ అలాగే మామూలు జీవనం గడపాలి. పౌరుషంగా అనుకుంది శర్వాణి. నేను మామూలుగా గడపకుండా ఈ నిజం బయటకువెల్లడిస్తే, నన్ను నేను అల్లరిచేసుకుంటే కన్నతల్లి తండ్రులూ తోడ బుట్టినవారూ, సంఘమూ ప్రభుత్వమూ ఎవ్వరూ ఆదరించరు పైగా రకరకాలుగా హింసిస్తారు. అందుకే ఈ నిజం నాలోనే ఉండిపోతుంది. నేను మామూలుగానే ఉంటాను స్థిరంగా నిశ్చయించుకుంది శర్వాణి.

కొన్ని క్షణాలు స్తబ్దుగా గడిచిపోయాయి. ఆమె ప్రశాంతంగా పరిశీలనగా ఓసారి మళ్ళీ ఆ అరటిచెట్టు వంక. చూసింది. అంతే ఆమె ప్రశాంత మానస జలధిలో మళ్ళీ ఓ ఉప్పెన చెలరేగింది. దుఃఖపు కెరటాలు ఎగిసిపడ్డాయి. ఆ అరటిచెట్టుకి అందంగా పూచిన పువ్వు....! నాకు గర్భంవస్తేనే.... అన్న ఆలోచన కలుగజేసింది. ఆ ఆలోచననకే ఆమె నిలువెల్లా వణికిపోయింది.

ఆడది కేవలం మానభంగం జరిగినందుకే... ఆహుతైపోతుంటే ఇందుకు కూడా... ఆ పాప భారాన్ని మోయవలసిన వస్తున్నందుకు కూడా భవిషత్తు భగ్నమై పోతున్నందుకు ఆత్మహత్య చేసుకుంటుందన్న విషయం అప్పుడు అర్థమైంది శర్వాణికి. ఒక పావుగంట ఆమెలో తీవ్ర సంచలనం... సంఘర్షణ మళ్లీ ఆమె ఏదో స్థిర నిర్ణయానికి వచ్చినట్లు స్థిమిత పడింది.

"అమ్మా నేనలా అరుణా వాళ్ళంటికి వెళ్ళి ఓ అరగంటలో వచ్చేస్తా... తలుపేసుకో" అంటూ బయటకు బయలుదేరింది శర్వాణి.

* * *

"నీపేరేమిటమ్మా..." అడిగింది లేడీ డాక్టర్

"ఆడది..." శర్వాణి నోటినుండి పదునుగా వచ్చిన మాట అది.

చివ్వున తలెత్తిచూసింది డాక్టర్... ఆమెకేం అర్థంకాక.

"ఏమైంది..." అన్నది.

"మానభంగం... రేప్..." అన్నది శర్వాణి.

"మానభంగమా..." పిడుగు పడ్డట్లు ఉలిక్కి పడింది.

"ఎప్పుడు... ఎలా జరిగింది..." అయోమయంగా అడిగింది.

"నిన్న సాయంత్రం..." ఆవేశంగా జరిగిందంతా చెప్పింది.

"ప్లీజ్ రిలాక్స్... ఏం చేద్దామనుకుంటున్నావు..." డాక్టరు అడిగింది.

"ఆత్మహత్య మాత్రంకాదు. బ్రతుకుదామనుకుంటున్నాను. నిండుగా నవ్వుతూ జరిగింది పూర్తిగా మర్చిపోయి... అతి మామూలుగా మామూలు జీవితం గడపగలిగితేనే... అందరిలా ఉండగలిగితేనే నాతమ్ముడు చెల్లెళ్ళు అమ్మానాన్న మామూలుగా జీవించగలుగుతారు. అలాకాక నేను ఏంచేసినా దాని ప్రభావం నా వాళ్ళందరిమీదా పడుతుంది. అందుకే నేను వాళ్ళకోసం నాకోసమూ అవి మరిచిపోయి బ్రతకాలనుకుంటున్నాను...." తడికళ్ళతో చెప్పింది.

"గుడ్....." డాక్టర్‌గొంతు ఆశ్చర్యంగాను అభినందనగాను ధ్వనించింది.

"నేను మామూలుగా బ్రతకాలంటే... దీని తాలూకూ ఏ విషయమూ నాకు బ్రతిబంధకం కాకూడదు. అందుకు మీరు సహాయం చెయ్యాలి డాక్టర్..." శర్వాణి డాక్టర్‌తో ఓ అరగంటపైగా చర్చించాక పరీక్షానంతరం డాక్టర్ ఆమె భుజం తట్టి ధైర్యం చెప్పి పంపింది.

నిన్నట్నుంచి జరిగిన మానసిక క్షోభ పోయి సాయంత్రం డాక్టరును సంప్రదించాక కలిగిన ధైర్యం ఆమెలో ఒక నిశ్చితాభిప్రాయాన్ని బలంగా కలుగజేసింది. ఆమెవద్ద సంఘర్షణకు సమాధానం లభించింది.

* * *

మరునటిరోజు ఉదయం

"తనపై కప్పబడిన చీకటి ముసుగును తీసిపారేసి ఉషాదేవి ఉరుకులు పరుగులతో వెలుతురుకిరణాలు రువ్వుతూ ముందుకు సాగింది.

పుస్తకాలు చేతపట్టుకుని "అమ్మా నేను కాలేజీకి వెళ్తున్నా"... అని చెప్పి వడివడిగా కాలేజీవైపు నడవ సాగింది శర్వాణి.

ఆ పరిస్థితుల్లో వేరే ఎవరైనా ఉంటే ఏంచేసేవారో... కానీ ప్రస్తుతం ఆమె ఎన్నుకున్న పరిష్కారమార్గం అదే. ఆమె నడిచేదారి అదే.

## పోటీక్విజ్ - 24 ఫలితాలు

సరైన సమాధానాలు :

1. బదరీనాథ్ సమీపంలో
2. కేదార్‌నాథ్
3. ఆదిశంకరులవారు
4. కావేరీనది
5. చందోర్ నగర్
6. ఎమ్. ఎస్. సుబ్బులక్ష్మి
7. సోనాలి

ఈ సమాధానంతో సరిపోయే సమాధానం రాసినవారు ముగ్గురు. వారు :

1. కె. మాధవీలత, కాకినాడ
2. వి. ఎస్. వాసంతి, తెనాలి
3. కె. తిలకవతి, మదురై

బహుమతి మొత్తం రు. 75. వీరికి సమానంగా పంచి అందజేస్తున్నాము